# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 19-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 46 | పేజీలు:4 | వెల: రూ.1/-


## గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి : మంత్రి తలసాని

హైదరాబాద్ : గణేశ్ నిమజ్జనానికి హుస్సేన్ సాగర్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన ఉత్సవాలకు ప్రభుత్వం సిద్ధమైనట్లు పేర్కొన్నారు. నిమజ్జన విధుల్లో పాల్గొనే అధికారులతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమీక్ష నిర్వహించారు. క్రేన్ నంబర్ 5 వద్ద ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం ఉంటుంది.

వీలైనంత త్వరగా నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జన ప్రక్రియలో పాల్గొనే వారందరికీ మాస్కులు పంపిణీ చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో 320 కిలోమీటర్ల పొడవునా గణేశ్ శోభాయాత్ర కొనసాగనుంది.

నిమజ్జన వేడుకల విధుల్లో 19 వేల మంది పోలీసు సిబ్బంది పాల్గొననున్నారు. జిల్లాల నుంచి 7 వేల మంది పోలీసులను రప్పించారు. నిమజ్జన విధుల్లో 8,700 మంది శానిటేషన్ సిబ్బంది పాల్గొననున్నారు. రేపు 40 వేల విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి. నిమజ్జనానికి ట్యాంక్ బండ్ వద్ద 40 క్రేన్లను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు మరో నాలుగు క్రేన్లను అదనంగా ఉంచనున్నారు. లైఫ్ జాకెట్లు, బోట్లను కూడా అందుబాటులో ఉంచారు. ట్యాంక్ బండ్ వద్ద 40 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారు.

## గణేశ్ శోభాయాత్ర.. నేడు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్ , సెప్టెంబర్ 18:గణేశ్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షల గురించి తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. ఎవరికైనా సందేహాలుంటే 040-27852482, 9490598985, 9010303626 నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

గణేశుని విగ్రహాలను తరలించే వాహనాలకు ప్రత్యేకంగా కలర్ కోడింగ్ ఏర్పాటు చేశారు. దీని ఆధారంగా ట్రాఫిక్ పోలీసులు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. ట్రాఫిక్ రద్దీని గూగుల్ మ్యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయనున్నారు. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి సంబంధించి జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు పూర్తిచేసింది.

నిమజ్జనం నేపథ్యంలో నగరంలో పలుచోట్ల ఆర్టీసీ బస్సులను దారి మళ్లించనున్నారు. అదేవిధంగా జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసి బస్సులను నగర శివార్లకే పరిమితం కానున్నాయి. నల్లగొండ వైపు నుంచి వచ్చే వాహనాలను ఎల్బీనగర్, వరంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఉప్పల్, దేవరకొండ నుంచి వచ్చే వాహనాలు సాగర్ రింగ్‌రోడ్డు, ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలను ఆరాంఘర్ వద్ద నిలిపివేయనున్నారు. ఇక అంతర్ రాష్ట్ర, జిల్లాల లారీల ప్రవేశంపై శనివారం అర్ధరాత్రి నుంచే నిషేధం విధించనున్నారు.

### 320 కిలోమీటర్లలో శోభాయాత్ర

ఆదివారం జరుగనున్న గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ శోభాయాత్రకు దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సుమారు 320 కిలోమీటర్ల మేర శోభాయాత్ర జరుగుతుందని, ఆయా రహదారులలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి సుమారు 19 వేల మంది వివిధ స్థాయిల్లోని పోలీసు సిబ్బంది విధులలో పాల్గొంటారని, ప్రతి క్రేన్ వద్ద, ప్రతి విగ్రహం వెంట ఒక పోలీసు అధికారిని నియమిస్తామని చెప్పారు.

వాహనదారులు, భక్తులకు ఇబ్బంది లేకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఆర్ అండ్ బీ అధికారుల సమన్వయంతో ట్రాఫిక్ డైవర్షన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖైరతాబాద్ వినాయకుడిని నిమజ్జనం చేసే క్రేన్ నెంబర్ 6 వద్ద హుస్సేన్‌సాగర్‌లో పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనానికి ఆర్టీఏ ఆధ్వర్యంలో వెయ్యి వాహనాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనవారు వినియోగించుకోవాలన్నారు. వాహనాల పర్యవేక్షణకు 10 మంది ఆర్టీఏ అధికారులు, 50 మంది మోటార్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించినట్లు మంత్రి చెప్పారు.

## దేశంలో 35 వేల మార్కును దాటిన కరోనా..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:దేశంలో కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ కార్యక్రమం జోరుగా సాగుతున్నా.. పాజిటివ్ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం 34 వేలకుపైగా పాజిటివ్ కేసులు నమోదవగా, తాజాగా అవి 35 వేలు దాటాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 35,662 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మరో 281 మంది కరోనా మహమ్మారికి బలయ్యారు. 33,798 మంది వైరస్ నుంచి బయటపడ్డారని తాజా కేసులతో కలిపి దేశంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 3,34,17,390కి చేరింది. ఇందులో 3,26,32,222 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ప్రస్తుతం దేశంలో 3,40,639 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దేశంలో నమోదైన మొత్తం కేసుల్లో అత్యధికంగా కేరళలో 22 వేలు, మహారాష్ట్రలో 3,595 కేసులు నమోదయ్యాయి.

గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు దేశంలో కరోనాబారినపడి 4,44,529 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం యాక్టివ్ కేసుల రేటు 1.02 శాతంగా, రికవరీ రేటు 97.65 శాతంగా ఉన్నట్టు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. శుక్రవారం దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మందికి వ్యాక్సిన్ వేసి రికార్డు సృష్టించారు.

## తెలంగాణలో కైటెక్స్ గ్రూప్ రూ. 2,400 కోట్ల పెట్టుబడి




హైదరాబాద్ , సెప్టెంబర్ 18: కేరళకు చెందిన వస్త్ర తయారీ పరిశ్రమ కైటెక్స్ గ్రూప్ తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడి పెడుతోంది. వరంగల్‌లోని కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో, రంగారెడ్డి జిల్లా చందన్‌వెల్లి సీతారామ్‌పూర్‌లో ప్లాంటు ఏర్పాటుకు కైటెక్స్ సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, కైటెక్స్ గ్రూప్ మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, సబిత ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, కైటెక్స్ గ్రూప్ ఎండీ సాబూ ఎం జాకబ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చిన కైటెక్స్ గ్రూప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రూ. 2,400 కోట్ల పెట్టుబడి పెట్టాలని కైటెక్స్ గ్రూప్ నిర్ణయించిందని తెలిపారు. దీంతో 22 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, మరో 18 వేల మందికి పరోక్ష ఉపాధి లభించనుంది. కైటెక్స్ పరిశ్రమలో 85 నుంచి 90 శాతం మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. లక్షల ఎకరాల్లో పండే పత్తిని కైటెక్స్ కొనుగోలు చేయనుందని తెలిపారు. సీఎస్ఆర్ కింద రూ. 6 కోట్ల విలువ చేసే పీపీఈ కిట్లు కైటెక్స్ ఇవ్వనుంది అని పేర్కొన్నారు. వచ్చే నవంబర్ నుంచి కైటెక్స్ గ్రూప్ తమ ఉత్పత్తులను ప్రారంభించనుంది. ఇతర రాష్ట్రాలు కైటెక్స్‌ను ఆహ్వానించినా.. రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా విమానం ఏర్పాటు చేసి తాము ఆహ్వానించామన్నారు. ఆ తర్వాత పెట్టుబడి అవకాశాలను వివరించామని కేటీఆర్ తెలిపారు.

మంత్రి కేటీఆర్ చూపిన చొరవ వల్లే తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నామని కైటెక్స్ గ్రూప్ ఎండీ సాబూ ఎం జాకబ్ తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల అనుకూల వాతావరణం, విధానాలు నచ్చాయని పేర్కొన్నారు. 3 మిలియన్ దుస్తులను ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తామని సాబూ ఎం జాకబ్ తెలిపారు.

## చార్ ధామ్ యాత్ర ప్రారంభం.. ఇవి కచ్చితంగా పాటించాల్సిందే!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:భారత దేశంలోని అత్యంత పవిత్రమైన తీర్ధ యాత్రల్లో ఉత్తరాఖండ్ చార్ ధామ్ ఒకటి. చార్?ధామ్? యాత్ర శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్? ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. కరోనా తీవ్ర స్థాయిలో ఉన్న రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులకు టీకాను తప్పనిసరి చేసింది. గంగోత్రి, యమునోత్రి, బద్రీనాథ్?, కేదార్?నాథ్? ఆలయాలకు వచ్చే యాత్రికులు కరోనా వ్యాక్సిన్? తీసుకున్నట్లు సర్టిఫికెట్?ను సమర్పించాలని తెలిపింది. వ్యాక్సిన్? తీసుకోని వారు ఆర్టీపీసీఆర్? నెగటివ్? రిపోర్టును సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేరళ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్?రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు పూర్తిస్థాయిలో వ్యాక్సిన్? తీసుకుని 15 రోజులు పూర్తయితేనే యాత్రకు అనుమతిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రతి రోజూ పరిమితి సంఖ్యలో భక్తులను అనుమతిస్తామని తెలిపింది. కాగా, యాత్ర చేపట్టాలనుకునే భక్తులు డెహ్రాడూన్ స్మార్ట్ సిటీ పోర్టల్, దేవస్థానం మేనేజ్‌మెంట్ బోర్డు పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

## పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం : మంత్రి సత్యవతి

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోడు భూముల సమస్యపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ ఇవాళ సమావేశమై చర్చించింది. తాత్కాలిక సచివాలయం బీఆర్కే భవన్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, అజయ్ కుమార్ పాల్గొని చర్చించారు. రెండు గంటలకు పైగా పోడు భూముల సమస్యలపై చర్చించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ భూముల సంరక్షణ, ఆర్ఓఎఫ్ఆర్ చట్టం అమలు, గిరిజనులు, గిరిజనేతరుల హక్కులను కాపాడటంపై కమిటీ క్షుణ్ణంగా చర్చించింది. ఈ నెల 24న మరోసారి సమావేశం కావాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా, అటవీ శాఖ పిసిసిఎఫ్ శోభ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రధాని మోదీని కలిసిన చినజీయర్ స్వామి, జూపల్లి రామేశ్వర్ రావు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని త్రిదండి చినజీయర్ స్వామి, జూపల్లి రామేశ్వర్‌రావు శనివారం ఉదయం కలిశారు. భగవత్ రామానుజాచార్యుల సహస్రాబ్దీ ఉత్సవాలకు, సమతామూర్తి విగ్రహావిష్కరణకు హాజరు కావాలంటూ ప్రధాని మోదీని చినజీయర్ స్వామి ఆహ్వానించారు. సహస్రాబ్ది మహోత్సవాల విశిష్టతను మోదీకి చినజీయర్ స్వామి వివరించారు. 216 అడుగుల రామానుజాచార్య పంచలోహ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మైహోం గ్రూప్ అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు మోదీకి రామానుజ ప్రాజెక్టు వివరాలను తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు.

### ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తి

సమతాస్ఫూర్తి కేంద్రం విశిష్టతను, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీకి ప్రతిబింబంగా ఏర్పాటు చేసిన 216 అడుగుల రామాను జాచార్య పంచలో విగ్రహ విశిష్టతను, అక్కడ కొలువుదీరనున్న 108 దివ్యదేశాల వివరాలను మోదీ ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రపంచ శాంతి కోసం చిన్న జీయర్ స్వామి చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందించిన ప్రధాని మోదీ.. విగ్రహ ఆవిష్కరణకు తప్పక వస్తానని హామీ ఇచ్చారు.

### దేశ ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు

గడిచిన ఐదు రోజులుగా ఢిల్లీలో పర్యటించిన త్రిదండి చిన్న జీయర్ స్వామి దేశ ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందించారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మంగళవారం కలిసిన చిన్నజీయర్ స్వామి.. సమతామూర్తి విగ్రహావిష్కరణకు ఆత్మీయంగా ఆహ్వానించారు. రామానుజాచార్య విగ్రహ విశేషాలను.. ఏర్పాటు చేయడానికి గల కారణాలను రాష్ట్రపతికి వివరించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తప్పక హాజరవుతానని రాష్ట్రపతి హామీ ఇచ్చారు. రాష్ట్రపతిని కలిసిన అనంతరం? ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, కిషన్ రెడ్డి, అశ్విన్ చూబె, భూపేంద్ర యాదవ్‌తో పాటు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణను కలిసి రామానుజ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ఆహ్వానించారు చిన్నజీయర్ స్వామి.

### సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ప్రత్యేకతలు

అనేక విశిష్టతలతో నిర్మితమవుతున్న సమతాస్ఫూర్తి కేంద్రం తుది మెరుగులు దిద్దుకుంటోంది. రూ. వెయ్యి కోట్లతో మొత్తం 200 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఈ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీని 216 ఫీట్ల ఎత్తులో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో రామానుజాచార్యులు విగ్రహాన్ని108 ఫీట్ల ఎత్తులో నిర్మిస్తున్నారు. భద్రవేది ఎత్తు 54 ఫీట్లు, పద్మపీఠం 27 ఫీట్లు, త్రిదండం 135 ఫీట్ల ఎత్తులో నిర్మిస్తున్నారు. ఇక భద్రవేదిలో 54 పద్మాలను ఏర్పాటు చేశారు. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పద్మం కింద 36 ఏనుగులను ఏర్పాటు చేశారు. 18 శంఖు, 18 చక్రాలతో మొత్తం 36 శంకుచక్రాలను ఏర్పాటు చేశారు. ఇక రామానుజాచార్యుల జీవిత చరిత్రను తెలిపే గ్యాలరీ, వేదాల సారాన్ని అందించే గ్రంథాల లైబ్రరీ, పండిత సభల కోసం ఆడిటోరియం, వివిధ ప్రదర్శనల కోసం ఓమ్నిమాక్స్ థియేటర్‌ను కూడా నిర్మిస్తున్నారు. అంత పెద్ద రామానుజచార్యుల విగ్రహానికి అభిషేకం నిర్వహించడం కష్టతరం కాబట్టి ప్రత్యేకంగా బంగారంతో రూపొందించిన రామానుజచార్యుల విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. 120 కేజీల బంగారంతో దీనిని తీర్చిదిద్దారు.

## 20 కోట్ల పన్ను ఎగవేసిన సోనూ సూద్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఇంట్లో వరుసగా మూడు రోజుల పాటు ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు చేసిన విషయం తెలిసిందే. అయితే నటుడు సోనూ సూద్ సుమారు 20 కోట్ల మేర ఆదాయపన్నును ఎగవేసినట్లు ఇవాళ ఆ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సోనూ సూద్‌కు చెందిన నాన్ ప్రాఫిట్ సంస్థ ఫారిన్ కాంట్రిబ్యూషన్ చట్టాన్ని ఉల్లంఘించి సుమారు 2.1 కోట్లు సమీకరించినట్లు ఐటీశాఖ చెప్పింది. నటుడికి సంబంధించిన ఇండ్లు, అతని అసోసియేట్స్ ఇండ్లు, ఆఫీసుల్లో నిర్వహించిన తనికీలు పన్ను ఎగవేతకు చెందిన అనేక పత్రాలు దొరికినట్లు ఐటీశాఖ తెలిపింది.

కరోనా మహమ్మారి వేళ హీరో సోనూ సూద్ తన విరాళాలతో ప్రశంసలు పొందిన విషయం తెలిసిందే. సోనూ సూద్ చారిటీ ఫౌండేషన్ సంస్థను గత ఏడాది జూలైలో ప్రారంభించారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆ సంస్థ 20 కోట్లు విరాళాల రూపంలో సేకరించినట్లు తెలుస్తోంది. దీంట్లో ఇప్పటి వరకు 1.9 కోట్లను ఖర్చు చేశారు. మరో 17 కోట్లు ఆ సంస్థ బ్యాంక్ అకౌంట్లోనే ఉన్నాయి.

బుధవారం రాత్రి అతని కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు.. గురువారం ఉదయాన్నే ఇంటికి చేరుకున్నారు. లక్నోకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థతో సోనూ సూద్‌కు ఉన్న ప్రాపర్టీ డీల్‌పై పన్ను అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. బుధవారం ఆరు చోట్ల సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. లక్నో రియల్ ఎస్టేట్ కంపనీతో జరిపిన డీల్‌పై అనుమానాలు ఉన్నాయి. ఈ డీల్‌లో పన్ను ఎగ్గొట్టారన్న ఆరోపణలపై సర్వే జరపాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆపరేషన్‌ను సర్వేగా వాళు పిలుస్తున్నారు. అయితే రాజకీయ కక్షతోనే సోనూ సూద్‌పై ఇలా ఐటీ దాడులు చేయిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కొవిడ్ సందర్భంగా చేసిన దాతృత్వ కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా సోనూ పేరు మార్మోగిన విషయం తెలిసిందే. అయితే అతడు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కలిసి, దేశ్ కా మెంటార్స్ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన కొన్ని రోజుల వ్యవధిలోనే సోనూపై ఇలా ఐటీ దాడుల జరగడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

## తమిళనాడు గవర్నర్‌గా రవీంద్ర నారాయణ్ రవి

చెన్నై, సెప్టెంబర్ 18: తమిళనాడు 26వ గవర్నర్‌గా రవీంద్ర నారాయణ్ రవి ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ పని చేసిన భన్వరీలాల్ పురోహిత్‌ను పంజాబ్‌కు బదిలీ అవగా.. ఆయన నాగాలాండ్ నుంచి తమిళనాడుకు వచ్చారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీబ్ బెనర్జి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీఎం ఎంకే స్టాలిన్, పలువురు మంత్రులు, ప్రతిపక్ష నేత కే పళనిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లోని పాట్నాలో జన్మించిన రవి, 1974 లో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేశారు. జర్నలిజంలో కొంతకాలం పనిచేసిన తర్వాత 1976లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో చేరారు. అతను కేరళలో ఒక దశాబ్దం పాటు వివిధ హోదాల్లో పని చేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లోనూ సేవలందించారు. ఐబీలో ఉన్న సమయంలో జమ్మూకశ్మీర్‌తో సహ ఈశాన్య రాష్ట్రాల్లో పని చేశారు.

2012లో ఐపీఎస్ సర్వీస్ నుంచి రిటైర్ అయ్యారు. ఆ తర్వాత పలు జాతీయ దినపత్రికలకు కాలమ్స్ రాశారు. ఆ తర్వాత ప్రధానమంత్రి కార్యాలయంలో జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ చైర్మన్‌గా, 2018 అక్టోబర్‌లో డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా నియామకమయ్యారు. ఆగస్ట్ 1, 2019 నుంచి ఈ నెల 15 వరకు నాగాలాండ్ గవర్నర్‌గా సేవలందించారు. ఆయన 2014లో నాగ శాంతి చర్చల్లోనూ పాల్గొన్నారు.

## మాణిక్యం ఠాగూర్‌కు మంత్రి కేటీఆర్ చురకలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 18: ఏఐసీసీ నాయకుడు మాణిక్యం ఠాగూర్ చేసిన ట్వీట్‌పై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ, ఆయనకు చురకలంటించారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌ను పరుష పదజాలంతో విమర్శించిన రేవంత్ రెడ్డి ఆడియో క్లిప్ బయటపడిన నేపథ్యంలో.. దాన్ని ఉద్దేశించి ఠాగూర్ ట్వీట్ చేశారు. ఓ సంభాషణను జర్నలిస్టు రికార్డు చేసి, దాన్ని అధికారంలో ఉన్న వారికి పంపితే, అలాంటి జర్నలిస్టుల గురించి ఏం ఆలోచించాలి? అని ఠాగూర్ ప్రశ్నిస్తూ.. సుపారీ జర్నలిస్టు అని పేర్కొనొచ్చు అంటూ ఆయన ట్వీట్ చేశారు.

ఈ ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ స్పందించారు. పీసీసీ చీఫ్ పోస్టును విక్రయించిన సుపారీ ఏఐసీసీ ఇంచార్జిల సంగతేంటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది తాను చెప్పడం లేదు.. మీ స్నేహితుడు, కాంగ్రెస్ ఎంపీనే స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు అంటూ ఓ న్యూస్ క్లిప్‌ను కేటీఆర్ తన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు. జర్నలిస్టులను ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేయడం సరికాదన్నారు కేటీఆర్.

## హైదరాబాద్‌లో టీఆర్ఎస్ శ్రేణులకు టార్గెట్ ఇచ్చిన కేటీఆర్



హైదరాబాద్ , సెప్టెంబర్ 18:హైదరాబాద్ నగరంలో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నగర ప్రజాప్రతినిధులను, సీనియర్ నాయకులను కోరారు. శనివారం టీఆర్ఎస్ పార్టీ నగర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గాల ఇంచార్జి లతో తెలంగాణ భవన్ లో సమావేశమయ్యారు. ఇప్పటికే హైదరాబాద్ నగరం మినహా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ స్థానిక కమిటీల నిర్మాణం పూర్తయ్యిందని, ఇదే స్ఫూర్తితో నగరంలోనూ డివిజన్ కమిటీల నిర్మాణం సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు.

ఇప్పటికే ఇందుకు సంబంధించి గతంలో ఏర్పాటు చేసుకున్న నగర ప్రత్యేక సమావేశంలో చర్చించిన విధంగా, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేటీఆర్ అన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులకు ఖచ్చితంగా అవకాశాలు వస్తాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. నగరంలో పార్టీని అజేయమైన శక్తిగా మార్చేందుకు పార్టీ సంస్థాగత నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని, ఈ విషయాన్ని గుర్తించి, ఈ కార్యక్రమాల కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. నగరంలోని కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని కేటీఆర్ కోరారు. రానున్న పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు పార్టీ తరఫున పార్టీ ప్రధాన కార్యదర్శి లను ఇంచార్జి గా నియమించనున్నట్లు కేటీఆర్ తెలిపారు.

ఈ సమావేశంలో నగర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీ మహమూద్ అలీ గార్లతో పాటు పార్టీ హైదరాబాద్ నగర ప్రజా ప్రతినిధులు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పోడుభూముల సమస్యలపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:రాష్ట్రంలో పోడుభూముల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం సమావేశమయింది. మంత్రి సత్యవతి రాథోడ్ అధ్యక్షతన బీఆర్కే భవన్‌లో జరుగుతున్న ఈ సమావేశానికి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ హాజరయ్యారు. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైన తర్వాత సమావేశమవడం ఇదే మొదటిసారి. ఈనెల 16న జరిగిన మంత్రి మండలి సమావేశంలో పోడు భూముల సమస్యలపై పూర్తి అవగాహన, పరిష్కారాల అన్వేషణ, సూచనల కోసం సీఎం కేసీఆర్ కేబినెట్ సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమయింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ పదమూడు భాషలందున
పదము గ ప్రజ వెల్ల మెచ్చు పాటల నిడుగన్
విదుదు_సలీల్ చౌదరి పై_
ముదముగ సరిపించు గాత పూజా భస్సున్ !!

(సెప్టెంబర్ 19 సంగీత నిధి సలీల్ చౌదరి జయంతి...)



-రాధశ్రీ

సెల్: 9494481210

# ప్రపంచ టెన్నీస్ కోర్టులో ప్రవహించిన కొత్త రక్తం

**(యూయస్ ఓపెన్ ఫైనల్‌లో యువ కిశోరాలు రాణించిన సందర్భంగా)**

జకోవిచ్ రాకెట్‌కు షాక్కిచ్చిన మెద్వెదేవ్ మెరుపులు:

యూయస్ ఓపెన్ పురుషుల ఫైనల్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సొంతం చేసుకొని 21వ టైటిల్ కోసం పోరాడుతున్న నొవాక్ జకోవిచ్ విజయం తథ్యమని నమ్మింది క్రీడా ప్రపంచం. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ప్రపంచ నెంబర్-1కు షాకిస్తూ రష్యా కుర్రాడు డానిల్ మెద్వెదేవ్ అద్భుత ఆటతీరుతో తొలి గ్రాండ్‌స్లామ్ యూయస్ ఓపెన్ టైటిల్‌తో రూ. 18.37 కోట్ల ప్రైజ్‌మనీ కైవసం చేసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆరున్నరడుగుల 25 ఏళ్ళ మెద్వెదేవ్ పదునైన సర్వీసులు, వేగవంతమైన ఏస్‌లతో అమోఘమైన ఆటతీరుతో విరుచుకుపడి జోకొవిచ్ ఒత్తిడిని పెంచుతూ అనవసర తప్పిదాలు చేసేలా ఆధిపత్యం ప్రదర్శించారు. 9-ఏళ్ళ వయసులోనే తొలిసారి రాకెట్ పట్టిన మెద్వెదేవ్ టెన్నీస్‌నే జీవితంగా మార్చుకున్నాడు. 2017లో అనామకుడిలా తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడిన మద్వెదేవ్ హార్డు కోర్టు అభిమానిగా పలు ఏటిపి టోర్నీల్లో జ్వెరేవ్, నాదల్, థీమ్, జోకొవిచ్, ఫెదరర్, కచనోవ్‌లతో సమానంగా నిలుస్తూ అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్నారు. యూయస్ ఓపెన్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరిన మద్వెదేవ్ అద్వితీయ ఆటతీరుతో జోకొవిచ్‌ను మట్టికరించి టైటిల్‌ను స్వంతం చేసుకున్నారు. ప్రపంచ టాప్ 3 ఆటగాళ్ళను ఓడించిన ఘనత మద్వెదెవ్‌కు మాత్రమే ప్రత్యేకం. ప్రత్యర్థులు ఊహించని ఆటతీరుతో ప్రదర్శించడమే తన ప్రత్యేకత అంటూ, గత మార్చిలో ప్రపంచ 2వ ర్యాంక్‌కు చేరడం, నేడు యూయస్ ఓపెన్‌ను చేజిక్కించుకోవడం శుభపరిణామంగా తోస్తున్నది. ఫెదరర్, నాదల్‌లు గాయాలతో వెనుదిరుగుతున్న వేళ జుకోవిచ్‌కు ధీటైన ప్రత్యర్థిగా మద్వెదెవ్ భవిష్యత్తు తారల్లో ప్రముఖుడిలా తోస్తున్నాడు. తన పెళ్లి రోజున సతీమణికి యూయస్ ఓపెన్ టైటిల్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిన మద్వెదెవ్ రాకెట్ ధాటికి జకోవిచ్ రాకెట్ జడిసి పోయింది. గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన 3వ రష్యా ఆటగాడిగా నిలిచిన మద్వెదెవ్ రాకెట్ మరింత వేగంగా సర్వీసులు విసురుతూ, కోర్టులో మెరుపు వేగంగా కదులుతూ, ప్రత్యర్థికి చెమట పట్టిస్తూ, టైటిల్ దిశగా బంతిని శాసిస్తూ, గెలుపును పర్యాయపదంగా చేసుకుంటూ మరిన్ని శిఖరాలు అధిరోహించాలని మద్వెదెవ్‌ను మనసారా ఆశీర్వదిద్దాం.

అన్‌సీడెడ్ టు గ్రాండ్‌స్లామ్ టైటిల్ దాకా ఎమ్మా రదుకా రాకెట్ అద్భుత విన్యాసం:

యూయస్ ఓపెన్‌లో అనామక అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా బరిలోకి దిగిన బ్రిటన్ టీనేజర్ 'ఎమ్మా రదుకా' అబ్బుర పరిచే క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి తొలికారు గ్రాండ్ స్లామ్ టైటిల్తో పాటు రూ. 18.37 లక్షల నగదు ప్రైజ్‌మనీని కైవసం చేసుకోవడంతో క్రీడాకారుల మనసుల్ని దోచుకుంటూ, ప్రపంచ క్రీడాభిమానులను ఆశ్చర్యపరిచింది. రొమేనియ తండ్రి, చైనా తల్లికి కెనడాలో పుట్టిన ఎమ్మా రదుకా తన 2వ ఏటనే ఇంగ్లాండ్‌లో అడుగు పెట్టింది. యూయస్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన ఇద్దరు అన్‌సూడెడ్ టెన్నీస్ క్రీడాకారిణిలు ఎమ్మా రదుకా (150వ ర్యాంకు), ఫెర్నాండేజ్‌లు (73వ ర్యాంకు) టోర్నీల పోరులో హోరాహోరీగా పోరాడి కొత్త బంగారు లోకాన్ని కోర్టులో చూపించగలిగారు. యుయస్ ఓపెన్‌లో అత్యున్నత ప్రతిభ కనబర్చిన 18 ఏండ్ల రదుకా, 19 ఏండ్ల ఫెర్నాండేజ్‌లు రాబోయే రోజుల్లో సీనియర్ క్రీడాకారులతో ఉప్పెనెలా తలబడుతూ తమ క్రీడా ప్రతిభను సుదీర్ఘకాలం ప్రదర్శించనున్నారని అర్థం అవుతున్నది. ఈ ఏడాది వింబుల్డన్‌లో 338వ ర్యాంకుతో బరిలోకి దిగిన రదుకా నాలుగో రౌండ్ వరకు వెళ్ళి శ్వాస సమస్యతో అర్ధాంతరంగా వెనుదిరిగిన విషయం మనకు తెలుసు. క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన యువకెరటం రదుకా ఏకంగా టైటిల్‌ను నెగ్గడం పెను సంచలనం అయ్యింది. క్వాలిఫయ్యర్‌లో 3 రౌండ్లతో కలిపి 10 మ్యాచ్‌లు ఆడిన రదుకా ఒక్క సెట్ కూడా ఓడకుండా, 20 సెట్లు/121 గేమ్‌లు గెలిచి ఛాంపియన్‌షిప్ చేజిక్కించుకోవడం (2014లో సెరీనా విలియమ్స్ తరువాత) రికార్డుగా నిలుస్తున్నది. కోర్టులో పాదరసంలా కదులుతూ, ప్రత్యర్థుల ఎత్తులకు ధీటైన సమాధానమిస్తూ, 1968 తరువాత యూయస్ ఓపెన్ నెగ్గిన బ్రిటన్ క్రీడాకారిణిగా ఎమ్మా రదుకా నిలిచింది. 150వ ర్యాంకుతో యూయస్ ఓపెన్ టోర్నీలో అడుగిడి ఏకంగా టైటిల్ కైవసం చేసుకోవడంతో 24వ ర్యాంకుకు ఎగబాకింది. 2004లో 17 ఏళ్ళ షరపోవా గ్రాండ్‌స్లామ్ టైటిల్ తరువాత నెగ్గిన అతి చిన్న వయస్కురాలిగా రదుకా పేరుగాంచి, 'బ్రిటన్ స్పోర్టింగ్ క్వీన్'గా కొనియాడబడింది. టెన్నీస్ చరిత్రలో ఊహకందని అద్భుతం సాధించిన 18 ఏళ్ళ రదుకా రాకెట్‌కు క్రీడాభిమానులు ముక్తకంఠంతో జయజయధ్వానాలు పలకడం సముచితంగా ఉన్నది. అద్భుతాలు ఆవిష్కరించడానికి వయసు, రాకెట్, ర్యాంకు, అపార అనుభవం అక్కరలేదని రుజువు చేస్తూనే, గెలవాలనే వజ్రసంకల్పం, అవిశ్రాంత శ్రమ తోడైతే అసాధ్యాలు సుసాధ్యాలుగా మారుతాయని రదుకా నిరూపించినట్లు అయ్యింది. ఐదేళ్ళ ప్రాయంలోనే రాకెట్‌ను శరీరంలో శాశ్వత అంగం మలుచుకొని గ్రాండ్‌స్లామ్ టైటిలే లక్ష్యంగా చేసిన కృషి ఫలించిన వేళ టెన్నీస్ సమాజం మరో ఉజ్వల భవిష్యత్తుగల ధ్రువతారను ఎమ్మా రదుకాలో చూస్తున్నది. అనామకురాలిగా బరిలోకి దిగిన రెండో గ్రాండ్ స్లామ్‌లోనే విజేతగా నిలిచిన రదుకా పేరు క్రీడా జగత్తులో మార్మోగుతున్నది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఏపీలో కర్ఫ్యూ పొడిగింపు.. కొత్త నిబంధనలు ఇవే..

అమరావతి, సెప్టెంబర్ 18:ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా కర్ఫ్యూ ఆంక్షల్ని ఈ నెల 30 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి రోజు రాత్రి 11 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపింది. ఈ కర్ఫ్యూ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే విపత్తుల నిర్వహణ చట్టం 2005, ఐపీసీ సెక్షన్ 188, ఇతర నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పెళ్లిళ్లు, శుభకార్యాలకు 150 మందికి మాత్రమే అనుమతి ఉందని ప్రభుత్వం తెలిపింది.

కోవిడ్ ప్రోటోకాల్స్ పాటించేలా అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. కార్యాలయాలు, సంస్థలు, వ్యాపార సముదాయాలు, దుకాణాల్లోకి మాస్కులు లేని వారిని అనుమతిస్తే జరిమానా విధిస్తారు. జరిమానా మొత్తాన్ని అక్కడి పరిస్థితుల ఆధారంగా ఖరారు చేస్తారు.

# ప్రధాని మోదీకి బర్త్ గిఫ్ట్.. 2 కోట్ల టీకాలు పంపిణీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:కరోనా కట్టడికి దేశంలో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పెరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం రెండు కోట్ల డోసుల టీకా అందించి రికార్డు సృష్టించారు. కరోనా టీకా వేయించుకొని ప్రధాని మోదీకి కానుక ఇవ్వాలని బీజేపీ నేతలు ఇచ్చిన పిలుపుకు భారీ స్పందన వచ్చింది. దేశంలో కోవిడ్ టీకా తీసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వ్యాక్సిన్ కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ స్పందన లభించింది. శుక్రవారం రెండు కోట్ల వ్యాక్సినేషన్లు జరగడంతో.. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు టీకా తీసుకున్న వారి సంఖ్య 75 కోట్లకు చేరింది. గాంధీ జయంతి (అక్టోబర్ 2) వరకు ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ వంద కోట్లకు చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.

# గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ కలెక్టర్

నల్లగొండ, సెప్టెంబర్ 18:: గణేశ్ నిమజ్జనోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీఐజీ రంగనాథ్ తెలిపారు. ఆదివారం నిమజ్జనం జరిగే నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువు, 14వ మైలురాయి వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

పటిష్ట బందోబస్తుతో పాటు సమయాన్నిపాటిస్తూ మండపాల నిర్వాహకులు వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, పోలీసులతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా శోభాయాత్ర, నిమజ్జనం జరిగే విధంగా ప్రతి ఒక్కరూ జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కోరారు.

# మందుబాబులకు షాక్.. మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:మందుబాబులకు ఇది చేదు వార్తే. హైదరాబాద్?లో గణేశ్? నిమజ్జనం పురస్కరించుకుని మద్యం దుకాణాలు, పబ్బులు మూసివేయాలని పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు దుకాణాలు బంద్ కానున్నాయి. హైదరాబాద్లోని మూడు కమిషనరేట్ల పరిధిలో వైన్స్, బార్లు, పబ్బులు, కల్లు దుకాణాలు మూసివేయాలి పోలీసులు ఆదేశించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి.

# చిరుధాన్యాల ఉత్పత్తిలో భారతదేశానిదే కీలకపాత్ర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:ఆహార భద్రతతోపాటు పోషణ భద్రత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పోషక ధాన్యాలపై మహాసమ్మేళనం 3.0ను ఆయన ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోషణ ధాన్యాలకు ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో "ఐక్యరాజ్య సమితి 2023" సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని వెల్లడించారు. భారతదేశం 2018లో జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం-2018 నిర్వహించినట్లు ఆయన గుర్తు చేశారు. మన పూర్వీకులు ఏళ్లుగా చిరు ధాన్యాలతో వండిన పదార్థాలను ఆహారంగా తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించారని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తీ పోషక విలువలు ఉన్న ఆహార ధాన్యాల ప్రాధాన్యత తెలుసుకొని ప్రతి రోజూ ఆహారంలో భాగంగా తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయరంగంలో ఉన్న లోటుపాట్లను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం వివిధ ఉద్దీపనల కింద రూ.1.5 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నూనె గింజలు, ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం(స్పెషన్ మిషన్) ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ మిషన్ ద్వారా నూనె గింజలు, ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమైన భూములు ఉన్న తెలంగాణ ప్రాంత రైతులకు మేలు చేకూరనుందని పేర్కొన్నారు. రాబోయే తరాలలో రైతు కుటుంబాలు సాగుకు దూరం కాకుండా చూడటంతోపాటు, ఇప్పటి రైతులకు వారి పంట ఉత్పత్తులపై లాభాలు తెచ్చిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాలు తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా కొత్తగా 10 వేల రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పిఒ)లు ఏర్పాటుచేసి, వాటికోసం రూ.6850 కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎఫ్‌పీఒల ద్వారా దేశంలో 86 శాతం మంది రైతుల జీవితాలలో సానుకూల మార్పులు రానున్నాయని మంత్రి పేర్కొన్నారు.

మహాసమ్మేళనం 3.0 ప్రారంభించడానికి ముందు ఈ సందర్భంగా వివిధ



స్టార్టప్ సంస్థలు, చిరు ధాన్యాల ప్రాసెసింగ్ సంస్థలు ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాళ్లను మంత్రి సందర్శించారు. అలానే భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) - భారత చిరుధాన్యాల పరిశోధన మండలి(ఐఐఎంఆర్) ప్రచురించిన వివిధ ప్రచురణలను ఇతర ప్రతినిధులతో కలిసి మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, సహకార మరియు రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్, కేంద్ర శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన శాఖ కార్యదర్శి డాక్టర్ శేఖర్ సి.మండే, వ్యవసాయ పరిశోధన, విద్య కార్యదర్శి డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర, కేంద్ర, ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ.ఆర్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనం ప్రారంభోత్సవం అనంతరం కేంద్ర మంత్రి తోమర్ మొక్కలు నాటి, విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు రైతులు, జీవ వైవిధ్య బృందాల ప్రతినిధులతో సంభాషించారు. అలానే 'గ్లాస్ హౌస్ రీసెర్చ్ ఫెసిలిటీ', 'పోషక ధాన్య విత్తన పరిశోధన కేంద్రం', 'చిరుధాన్యాల ఆహారం, శుద్ధి కేంద్రాల స్టార్టప్ ఫెసిలిటీ', 'ఫ్లేకింగ్ లైన్స్' ప్రారంభించారు. ఐసీఏఆర్-ఐఐఎంఆర్ లో ఉన్న బిజినెస్ ఇంక్యుబేటర్, న్యూట్రిహబ్ తోపాటు ఆహార శుద్ధి సదుపాయాలను మంత్రి సందర్శించారు.

రెండు రోజులపాటు హైదరాబాద్‌లో కొనసాగనున్న ఈ మహా సమ్మేళనం 3.0ను ఐసీఏఆర్-ఐఐఎంఆర్‌తోపాటు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఒ), కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన "అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం 2023" సన్నాహ కాలలో భాగంగా వరుసగా 3 సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌ఘఢ్, అస్సాం, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలనీ వాసులపై కేసు నమోదు

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:సైదాబాద్ లో ఆరేళ్ల చిన్నారి హత్యాచారం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. అయితే, సింగరేణి కాలనీ స్థానికులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 10న తమ విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. చిన్నారి మృతదేహాన్ని తరలించే సమయంలో స్థానికులు పోలీసులను అడ్డుకున్నారు. ఆరోజు విధుల్లో ఉన్న పోలీసులపై స్థానికులు రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో పలువురు మహిళా పోలీస్ సిబ్బందికి గాయాలయ్యాయి. దీంతో ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాగా, సైదాబాద్ ఘటన కేసులో నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, నిందితుడు రాజు మృతిపై జ్యుడీషియల్ విచారణకు హైకోర్టు ఆదేశించింది. రాజుది ఆత్మహత్య కాదని.. కస్టోడియల్ మృతిగా అనుమానం ఉందని పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ పిల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిల్ దాఖలు చేశారు. దీని?పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మేజిస్ట్రేట్ కు హైకోర్టు ఆదేశించింది. వరంగల్ 3వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కు విచారణ బాధ్యతలు అప్పగించింది. నాలుగు వారాల్లో సీల్డు కవర్ లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

# ఓటరు తుది జాబితాను సిద్ధం చేయాలి : వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్‌గోయల్



సంగారెడ్డి ,సెప్టెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి)మెదక్ : 2022 జనవరిలో ఓటరు తుది జాబితా ప్రకటించే నాటికి ఎలాంటి తప్పిదాలు లేకుండా సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్‌గోయల్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్?లో మాట్లాడారు. ఓటరు జాబితాలో ఎలాంటి లాజికల్ తప్పులు లేకుండా మార్పులు, చేర్పులు వంటివి చేపట్టి ఈ నెల 30వ తేదీలోగా పరిష్కరించాలని సూచించారు. నవంబర్ నాటికి డ్రాఫ్ అవుట్ పబ్లికేషన్ జారీ చేసేముందే చనిపోయిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లు తొలగించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను రేషనైలేజేషన్ చేస్తూ ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు గుర్తించాలన్నారు. స్విప్ కార్యక్రమాల్లో భాగంగా గ్రామ స్థాయి వరకు ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

ఓటరు జాబితాల్లో తప్పొప్పుల సవరణ, మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఎటువంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేవని కలెక్టర్ హరీశ్ తెలిపారు. రేషనైలేజేషన్‌లో భాగంగా జిల్లాలోని రెండు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో కొత్తగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత లేదని తెలిపారు. ఓటరు ఈ ఎపిక్ కార్డులకు సంబంధించి 1,636 మంది దరఖాస్తు చేసుకోగా 949 మంది కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని, మిగతా ఓటర్లు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సమాచారం ఇస్తున్నామని ఆయన తెలిపారు. అదే విధంగా ఎపిక్ కార్డు పోయిన, పాడైపోయిన వాటికి సంబంధించి 387 దరఖాస్తులు రాగా 33 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపర్చుటకు ఏర్పాటు చేసిన గోదాములో అదనంగా ఒక హాలు నిర్మించేందుకు రూ.53 లక్షలతో పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కలెక్టర్ కోరారు.

విద్యార్థులు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలి..

17, 18 ఏండ్ల వయసు కలిగి ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరీశ్ అధికారులకు సూచించారు. అందుకనుగుణంగా పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కార్యకలాపాలు చురుకుగా కొనసాగించాలని సూచించారు. ప్రతి ఓటరు ఓటు హక్కు విలువను, ఎన్నికల ప్రవర్తనానియమావళిని తెలుసుకొని నైతిక బాధ్యతగా ఓటు వేసేలా అవగాహన కలిగించాలని స్విప్ నోడల్ అధికారి రాజిరెడ్డికి సూచించారు. ఇందుకు సంబంధించి భారత ఎన్నికల సంఘం చక్కగా తెలుగులో ఓటేద్దాం రండి పేరున చిన్న పుస్తకం ముద్రించిందని, దానినిఅన్ని లిటరసీ క్లబ్‌లకు అందించాలన్నారు. నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా ?ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ గరుడ యాప్‌పై త్వరలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్?లో అదనపు కలెక్టర్ రమేశ్, ఆర్డీవో సాయిరాం, స్విప్ నోడల్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

# వ్యాక్సినేషన్‌ను ఉద్యమంలా నిర్వహించాలి: మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్ సెప్టెంబర్ 18:(నేటినిజం ప్రతినిధి): ప్రత్యేక కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్నిఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో జూమ్ వీడియో ద్వారా కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీకా పంపిణీ పై సమీక్షించారు. కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో టీకా పంపిణీ కార్యక్రమం సవ్యంగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పాదయాత్ర చేయడం కాదు.. దమ్ముంటే దళితబంధుకు నిధులు తీసుకురా..

హుజూరాబాద్, సెప్టెంబర్ 18: బీజేపీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. పాదయాత్ర చేయడం కాదు.. చేతనైతే, దమ్ముంటే దళితబంధుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని బండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో బండ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు.

కేంద్రం రాష్ట్రానికి, హుజూరాబాద్ నియోజకవర్గానికి ఏం మేలు చేసిందో చెప్పాలన్నారు. దళితులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి రూ. 10 లక్షలు ఇచ్చారు. ప్రతి దళిత కుటుంబానికి రూ. 50 లక్షలు ఇవ్వాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. నిజంగా బీజేపీ నాయకులకు దళితులపై ప్రేమ ఉంటే.. కేంద్రం నుంచి రూ. 40 లక్షలు తీసుకురాగలరా? అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. మంత్రి హరీశ్‌రావును విమర్శించే అర్హత ఈటల రాజేందర్‌కు లేదన్నారు. బీజేపీ మాటలు నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరు.. అధికారంలోకి వస్తాం అంటూ కలలు కనడం మానుకోవాలన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీకి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. సీఎం కేసీఆర్, హుజూరాబాద్ ప్రజల ఆశీస్సులతో గెల్లు శ్రీనివాస్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు.




# సరైన పోషణతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం.....!

## -జిల్లా అదనపు కలెక్టర్ రాజర్షి షా.




సంగారెడ్డి, సెప్టెంబర్ 18( నేటినిజం ప్రతినిధి) శుక్రవారం మహిళా ప్రాంగణంలోని సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ , అనుబంధ శాఖల అధికారులతో పోషన్ అభియాన్ జిల్లాస్థాయి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజార్శి మాట్లాడుతూ ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న పోషణ అభియాన్ మాసంలో భాగంగా రక్తహీనత ,పౌష్టికాహార లోపం, తల్లిపాల ప్రాముఖ్యత, ఐదు సూత్రాల ను పాటించడం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు, 0-6 సంవత్సరాల లోపు చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోషన్ అభియాన్ కి సంబంధించి అన్ని పారామిటర్స్ పూర్తి చేయాలన్నారు.

ఆజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా జిల్లాలో 75 పాఠశాలలో ఫ్రీడం రన్ చేస్తున్నారని, ఆ సమయంలో ఆయా పాఠశాలల వద్ద న్యూట్రిషన్ కు సంబంధించిన ప్లకార్డ్స్, బ్యానర్స్ కట్టించి అందరికీ అవగాహన కలిగేలా చూడాలన్నారు.

జిల్లాలో 1104 అంగన్వాడీ కేంద్రాలలో న్యూట్రి గార్డెన్స్ ను ఏర్పాటు చేశామన్నారు. వంద శాతం న్యూట్రి గార్డెన్స్ పూర్తి చేయాలని సూచించారు.

జిల్లాలో కోవిడ్ వ్యాక్సినేషన్ జరుగుతుందని, పోషణ్ అభియాన్ తో పాటు, వ్యాక్సినేషన్ సర్వేలో భాగస్వాములై వంద శాతం పూర్తి చేయాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు.

అంతకుముందు పోషణ అభియాన్ కు సంబంధించి న గోడ పత్రికను అదనపు కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

సమావేశంలో శ్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద,జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ సురేష్ మోహన్, సి డి పి వో లు,డి సి పి ఓ రత్నం, అంగన్వాడీ టీచర్లు, మహిళా ప్రాంగణం కోఆర్డినేటర్, పోషణ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నేతలకు ఏపీ గవర్నర్ అపాయింట్‌మెంట్



అమరావతి, సెప్టెంబర్ 18:టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై వైసీపీ నేతలు, కార్యకర్తల దాడికి సంబంధించి టీడీపీ నేతలు ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కు ఫిర్యాదు చేయనున్నారు. ఈ మేరకు టీడీపీ నేతలు గవర్నర్ అపాయింట్ మెంట్ కోరగా.. ఆయన ఖరారు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ నేతలకు ఆయన అపాయింట్ మెంట్ ను ఇచ్చారు. చంద్రబాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై పూర్తి సాక్ష్యాధారాలతో గవర్నర్ కు వర్ల రామయ్య, గద్దె రామ్మోహన్, ఆలపాటి రాజా, అశోక్ బాబులతో కూడిన టీడీపీ నేతల బృందం ఫిర్యాదు చేయనుంది.

కాగా, నిన్న ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే జోగి రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు.. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసాన్ని ముట్టడించారు. దీంతో టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.

# కాలంతో పోటీ పడి కేసులను పరిష్కరించాలి

## -హైకోర్టు జడ్జి లక్ష్మణ్

నిజామాబాద్, సెప్టెంబర్ 18: ఉమ్మడి జిల్లా జ్యుడిషియల్ న్యాయవిచారణలో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల విచారణను వేగవంతం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. కరొనా మహమ్మారి విలువైన కాలాన్ని న్యాయమూర్తులకు, న్యాయవ్యవస్థకు దూరం చేసిందని దానిని పూడ్చుకోవడానికి శ్రమించాలని తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో న్యాయాధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత కేసులకు ప్రాధాన్యతనివ్వాలని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నూతనంగా నమోదైన కేసులను కక్షిదారులు, న్యాయవాదుల అభీష్టం మేరకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. న్యాయాధికారులకు దిశా, నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి న్యాయస్థానాలలో మౌలిక వసతులు, వివిధ న్యాయస్థానాలలో కేసుల వివరాలు, వాటి స్థితిగతుల వివరాలు తెలిపారు.

అనంతరం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి లక్ష్మణ్ మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులకు మార్గదర్శకులుగా ముందుండి నడిపించాలని అన్నారు. నిరంతర అధ్యయనం, కష్టపడేతత్వమే న్యాయవాదుల నిత్య వృత్తి జీవనంలో పాటించాలని సూచించారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టుల తీర్పులను చదివి అప్‌డేట్ కావాలని, భారత పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు రూపొందించే చట్టాలను తెలుసుకోవాలని, చట్టాల సవరణలను గమనిస్తూ ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎర్రం విఘ్నేశ్, జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, అదనపు జిల్లా జడ్జిలు గౌతం ప్రసాద్, పంచాక్షరి, సీనియర్ న్యాయవాదులు జివి.కృపాకర్‌రెడ్డి, రాజలింగం, ప్రభుత్వ న్యాయవాది ఈగ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన 'న్యాయవాదులు ? న్యాయపరమైన నైపుణ్యాలు' అనే రెండురోజుల శిక్షణా తరగతులను హైకోర్టు జడ్జి ప్రారంభించారు. ఒకరోజు అధికారిక పర్యటన నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రోడ్డు భవనాల శాఖ అతిథి గృహానికి చేరుకున్న హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్‌ను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్తికేయ, నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.... !

## -ఉమ్మడి మెదక్ జిల్లా కోర్టు న్యాయమూర్తి బి. పాపిరెడ్డి.

సంగారెడ్డి ,సెప్టెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి) శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సాధారణ పౌరులకు న్యాయ సేవలు, చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయ సేవాధికారిత సంస్థ సేవలను క్షేత్ర పరిధికి తీసుకెళ్లాలన్నదే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. క్షేత్ర పరిధి వరకు ప్రతి వ్యక్తికి చట్టాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని తెలిపారు.

మండలంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉంటుందని, ఏ సమస్య ఉన్నా సంప్రదించవచ్చని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ,మహిళలు ,నిరుపేదలకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు కల్పించడం జరుగుతుందన్నారు.

మొదటి అదనపు సెక్షన్ కోర్టు న్యాయమూర్తి కె. సునీత మాట్లాడుతూ చేసే ప్రతి పని చట్టంతో ముడిపడి ఉంటుందన్నారు. ఏది తప్పు ఏది ఒప్పు అన్నది తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తప్పని తెలిసినా చేయడం నేరమని, మన ఆలోచనా విధానం మారాలన్నారు. చాలా చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకోవాలని, చట్టంలో పొందుపరచిన అంశాలను అవగాహన చేసుకోవాలన్నారు. అప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. ఎవరి వంతు వారు సమాజానికి సేవలు అందించాలని కోరారు.

జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి




పరిష్కారం కానీ ఎన్నో కేసులను రాజీ కుదిర్చి పరిష్కరించిన ఘనత జిల్లా న్యాయమూర్తి కే దక్కుతుందన్నారు. లోక్ అదాలత్ లో అత్యధిక కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో సఖి సెంటర్ ద్వారా అద్భుతమైన సేవలు అందుతున్నాయని నిరుపేదలకు సంబంధించిన ఏ సమస్యనైనా న్యాయసేవాధికార సంస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అన్ని గ్రామాల్లో కి లీగల్ సర్వీసెస్ ఉన్నదన్న విషయాన్ని తీసుకెళ్లాలని తెలిపారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ సిహెచ్.ఆశాలత లీగల్ సర్వీసెస్ అథారిటీ పనితీరు, ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుందన్న విషయాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవ సదస్సులు, అవగాహన క్యాంపుల ద్వారా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సఖి, భరోసా కేంద్రంల ద్వారా అందిస్తున్న సేవలు, ఏ విధమైన సహాయం అందుతుంది, ఎలాంటి చట్టాల రక్షణ లభిస్తుందన్న విషయాలపై ఆయా అధికారులు వివరించారు.

అనంతరం సఖి కేంద్రం సేవలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను జిల్లా జడ్జి విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, గవర్నమెంట్ ప్లీడర్ నర్సింగరావు, పిపి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, డి ఆర్ డి ఓ ఏ పి డి సూర్యారావు, సి డి పి వో లు, సర్పంచులు ,మహిళలు, పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడి టీచర్లు, ఆటో డ్రైవర్లు, వివిధ వర్గాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌ను ఈటల అస్తవ్యస్తంగా మార్చారు : మంత్రి గంగుల

హుజూరాబాద్, సెప్టెంబర్ 18: ఏడేళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ఈటల రాజేందర్ హుజూరాబాద్ మున్సిపాలిటీ అస్తవ్యస్తంగా మార్చివేశారని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. శనివారం ఆయన పట్టణంలో రూ.56 కోట్లతో మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు అభివృద్ధిలో దూసుకెళుతుంటూ హుజూరాబాద్‌లో ఈటెల నిర్లక్ష్యంతో గతంలో ఉన్న రోడ్లు పూర్తిగా పాడైనా.. మున్సిపాలిటీగా మారినా అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.

హుజూరాబాద్ దుస్థితిపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి తక్షణం రూ.35కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో రూ.25కోట్లు మురికి కాలువలు, రోడ్లకే కేటాయించినట్లు చెప్పారు. మరిన్ని పనులు పెండింగ్‌లో ఉండడంతో మరో రూ.15కోట్లు విడుదల చేశారని తెలిపారు. వీటితో 150 రోడ్లను, బోర్నపల్లి ఇతర శివారు రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్‌లో మాదిరిగా రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లతో రోడ్లను ఆధునికీకరిస్తామన్నారు.మరో నెల రోజుల్లో



ఈ పనులన్నీ పూర్తయి.. హుజూరాబాద్ అత్యద్భుతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గందె రాధిక, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మలా కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ వెంకన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ ఎంపీటీసీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై బీజేపీ ఎంపీటీసీ ఈర్మ గంగామణి టీఆర్ఎస్‌లో చేరారు. బాల్కొండ నియోజకవర్గం లక్కోర గ్రామానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శనివారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో వారి అనుచరులతో కలిసి హైదరాబాద్ లో గులాబీ తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగధర్, జెడ్పీటీసీ భారతి రాకేశ్ చంద్ర, ఎంపీపీ బీమా జమున, పార్టీ సీనియర్ నాయకులు



రేగుల్ల రాములు, సర్పంచ్ లు ఆకుల రాజేశ్వర్ అమినాపూర్, వంశీ లక్కోర, గంగారెడ్డి నడకూడా, రమేశ్ జానకం పేట్, నితీశ్ కొత్తపల్లి, సుధాకర్ సాహెబ్ పేట్, అమినాపూర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ కొరతకు చెక్ : నెలకు 25 కోట్ల డోసుల సేకరణకు సన్నాహాలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఒక్కరోజులో రికార్డుస్థాయిలో అత్యధిక టీకా డోసులు పంపిణీ చేసిన క్రమంలో ఇదే ఊపును కొనసాగించేందుకు ప్రభుత్వం కసరత్తు సాగిస్తోంది. ప్రతినెలా 25 కోట్ల కొవిడ్-19 టీకా డోసులను సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్‌లో భారత్ దాదాపు 20 కోట్ల కొవిషీల్డ్ డోసులు, 3.5 కోట్ల కొవాగ్జిన్ డోసులను సమీకరించనుందని తెలిపాయి. ఈ ఏడాది చివరికి దేశంలో మొత్తం 135 కోట్ల జనాభా అంతటికీ కనీసం టీకా ఒక డోసు అందించాలనే లక్ష్యానికి అనుగుణంగా టీకా సేకరణను వేగవంతం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. థర్డ్ వేవ్ తలెత్తుతుందనే అంచనాల నేపథ్యంలోనూ త్వరితగతిన వ్యాక్సినేషన్ లక్ష్యాలను చేరుకోవాలని కేంద్రం యోచిస్తోందని అన్నారు. ఇక 24 గంటల్లో 2.47 కోట్ల మందికి వ్యాక్సినేషన్ చేపట్టి ప్రపంచరికార్డు నమోదు చేసిన చైనాను మనం శుక్రవారం 2.50 కోట్ల డోసుల పంపిణీతో అధిగమించామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ పేర్కొన్నారు.

# మమతకు జై కొట్టిన మరో బీజేపీ నేత.. టీఎంసీలో చేరిన బాబుల్ సుప్రియో



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బిజెపి నుంచి అధిక సంఖ్యలో వలసలు కొనసాగుతున్నాయి.

అందుకే పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు టీఎంసీ గూటికి చేరగా?. తాజాగా కేంద్ర మాజీ మంత్రి బాబుల్ సుప్రియో తృణమూల్ కాంగ్రెస్ లో చేరారు.

శనివారం కోల్ కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన టీఎంసీ పార్టీ కండువా కప్పుకున్నారు.

ఇటీవల జరిగిన కేంద్ర క్యాబినెట్ విస్తరణ లో బాబుల్ సుప్రియో మంత్రి పదవిని కోల్పోయారు. దాంతో బీజేపీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. పార్టీకి రాజీనామా చేశారు. తాను ఏ పార్టీలోనూ చేరబోనని, రాజకీయాల నుంచి వైదొలగుతానని అప్పట్లో ప్రకటించిన బాబుల్ సుప్రియో? తాజాగా మనసు మార్చుకున్నారు. తాను పార్లమెంటు సభ్యుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తృణముల్ కాంగ్రెస్ లో చేరారు.

# రెండోసారి చాణక్య అవార్డు గెలుచుకున్న కొణతం దిలీప్




పనాజీ, సెప్టెంబర్ 18:: తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ మీడియా డైరక్టర్ కొణతం దిలీప్‌కు.. ఈ యేటి పీఆర్‌సీఐ చాణక్య అవార్డు దక్కింది. పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అందించే ఈ అవార్డును దిలీప్ అందుకోవడం వరుసగా ఇది రెండవ సారి. గోవా సీఎం ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా దిలీప్ ఈ అవార్డును స్వీకరించారు. గోవాలో ఈ నెల 17వ తేదీన జరిగిన 15వ పీఆర్‌సీఐ గ్లోబల్ కమ్యూనికేషన్స్ సదస్సులో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన డిజిటల్ మీడియా శాఖ అత్యద్భుత పనితీరును గుర్తిస్తూ కొణతం దిలీప్‌కు ఈ అవార్డును ప్రజెంట్ చేశారు. రెండోసారి అవార్డు గెలుచుకున్న దిలీప్‌కు మంత్రి కేటీఆర్ కంగ్రాట్స్ తెలిపారు.

పబ్లిక్ రిలేషన్స్ రంగంలో వ్యక్తులు, సంస్థలు, కార్పొరేట్లు కనబరిచే అసాధారణ ప్రతిభ ఆధారంగా పీఆర్‌సీఐ చాణక్య అవార్డులను అందజేస్తారు. అయితే తాము పనిచేస్తున్న ఆయా రంగాల్లో దేశానికి పేరు తెచ్చిన అచీవర్స్, నేతలకు ఈ అవార్డులను పీఆర్సీఐ ఇస్తుంది. 2020 సంవత్సరంలో కూడా చాణక్య అవార్డును దిలీప్ గెలుచుకున్నారు. బెంగుళూరులో జరిగిన ఈవెంట్‌లో ఆయన ఆ అవార్డును అందుకున్నారు.

# గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

## -నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయ



నిజామాబాద్, సెప్టెంబర్ 18:ఆదివారం నిజామాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో ప్రజలు ఆనందంగా పాల్గొనేందుకు గాను పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా పోలీసు కమిషనర్ కార్తికేయ శనివారం తెలిపారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మరాదని, ఏదేని సమాచారం ఉంటే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు. శోభాయాత్ర జరిగే సమయంలో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటాయని, హైదరాబాద్ నుంచి బోధన్ వయా మాధవ్ నగర్ , బైపాస్ రోడ్డు కంఠేశ్వర్ , అర్సపల్లి, బోధన్ వెళ్లాలని, బోధన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు బోధన్ , అర్సపల్లి, బైపాస్ , కంఠేశ్వర్ , మాధవ్‌నగర్ గుండా వెళ్లాలని వివరించారు. బాసర బ్రిడ్జిపై నిమజ్జనం జరిగేందుకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందన్నారు.

ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలను జానకంపేట, సాటాపూర్ గేట్ , కందకుర్తి, ధర్మాబాద్ , బిద్రెలి, బైంసా గుండా వెళ్లాలని తెలిపారు. గణేశ్ నిమజ్జనం తర్వాత వాహనాలు బిద్రెల్లి, ధర్మాబాద్ , కందకుర్తి ద్వారా లేదా భైంసా, నిర్మల్ , ఆర్మూర్ నిజామాబాద్ రావల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు 19 నుంచి 20న సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం, రైల్వేకమాన్ , కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు మీదుగా మాధవ్‌నగర్ వైపునకు వెళ్లాలన్నారు.

మద్యం తాగి గణేశ్ నిమజ్జన వాహనాలు నడిపే వారిపై ఆల్కామీటర్‌తో పరీక్షలు జరుపుతామని స్పష్టం చేశారు. డీజేలకు అనుమతి లేదని, టపాకాయలు కాల్చరాదని సీపీ కార్తికేయ వివరించారు. బందోబస్తులో భాగంగా నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.

# రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 18: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ పేరుకే పీసీసీ అధ్యక్షుడు అని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పినట్లు రేవంత్ నడుచుకుంటున్నారని చెప్పారు. రేవంత్ నైజం ఏంటో శశిథరూర్‌పై ఆయన మాట్లాడిన మాటలు చూస్తుంటే అర్థమవుతుందన్నారు. తెలంగాణ కంటే కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లిక్కర్ అమ్మకం ఎక్కువగా ఉందన్నారు. బెల్ట్ షాపులకు కర్త, కర్మ, క్రియ.. కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారు. అందుకు చార్జ్‌షీటు వేస్తారా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు.

## ప్రతి ఒక్కరూ రేవంత్‌ను తిడుతున్నారు : ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

గజ్వేల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డిని తిడుతున్నారు అని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అబద్దాలు మాట్లాడి ప్రజలను మోసం చేసేలా కాంగ్రెస్ నేతల మాటలు ఉన్నాయన్నారు. గజ్వేల్‌కు రైలు వచ్చిందంటే.. అది కేసీఆర్ వల్లే అని తెలిపారు. అధికారం కోల్పోయి 10 ఏండ్లు అవుతుండటంతో ఆక్రోశంతో కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. పల్లెను వదిలిన ప్రతి ఒక్కరూ కేసీఆర్ పాలనలో మళ్లీ పల్లెకు చేరారు అని ఎంపీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఘనంగా ఆదిశ్రీనివాస్ జన్మదిన వేడుకలు

## -రాజన్న కోడె ముక్కు అర్చనలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఆది శ్రీనివాస్ 55వ జన్మదిన సందర్భంగా రాజన్న ఆలయంలో కోడె కట్టేసి మరియు స్వామివారికి అభిషేకం చేయించడం జరిగింది. వారు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని అలాగే వారు ఉన్నత పదవులు పొందాలని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది.అనంతరం ఆలయం ముందు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగుల విష్ణు ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, మొండె రాజు, వస్తాది కృష్ణగౌడ్ పోతుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# మైనార్టీ జూనియర్ కళాశాల, పాఠశాలను సందర్శించిన జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): మైనారిటీ స్కూల్ అలాగే జూనియర్ కాలేజీను శనివారం డిస్ట్రిక్ట్ అకాడమిక్ కోఆర్డినేటర్ మహమ్మద్ మిరాజ్గారు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి టీచర్ ను పరీక్షించి వారి యొక్క సామర్థ్యాలను పరిశీలించి ప్రతి టీచర్ యొక్క బోధన పద్ధతిని వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు అదేవిధంగా పాఠశాలలో జరుగుతున్నటువంటి బోధన పటిమను, అదేవిధంగా 24 ,25 రోజున నిర్వహించినటువంటి 9వ తరగతి మరియు పదవ తరగతి ఎఫ్ ఏ వన్ విజయవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. అదే విధంగా ఉపాధ్యాయులు పిల్లలకు ప్రాజెక్టులు మరియు యు ఎఫ్ 1 కుసంబంధించిన విషయాలపై చర్చించారు ఉపాధ్యాయులు బోధిస్తున్న ఆన్లైన్ క్లాస్ లను వీక్షించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే తిరుపతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కర్ధనూర్‌లో మంకీ ఫుడ్ కోర్టు

హైదరాబాద్ , సెప్టెంబర్ 18: కోతుల ఆహార భద్రతకు ఆలోచిస్తున్న ప్రభుత్వం మాదని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన పటాన్ చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో మంకీ ఫుడ్ కోర్టులో పండ్ల మొక్కలు నాటారు. గ్రామ పరిధిలోని ఎకరా స్థలంలో కోతుల ఆహారం కోసం ఫుడ్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతుల సంఖ్య పెరిగిపోవడంతో అవి ఆహారంకోసం జనావాసాలకు వస్తున్నాయన్నారు. వాటి ఆహార సమస్యను తీర్చేందుకు ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు పెంచి కోతుల ఫుడ్ కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాదన్నారు. అదేవిధంగా గ్రామ పరిధిలో పంచాయతీ ఆదాయం కోసం 30 షటర్లతో వాణిజ్య సముదాయాన్నినిర్మించేందుకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. త్వరలోనే షటర్లు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక వేస్తున్నామన్నారు. దాతల సాయం, ఎమ్మెల్యే నిధులతో పనులు పూర్తి చేస్తామన్నారు. ఆదర్శగ్రామంగా కర్ధనూర్ అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు.సీఎం కేసీఆర్ అనేక రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం జడ్పీసీఈవో ఎల్లయ్య మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రతీ గ్రామం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్ డీవో శ్రీనివాస్, జడ్పీటీసీ సుప్రజావెంకట్ రెడ్డి, ఎంపీపీ సుష్మశ్రీ, సర్పంచ్ ఎర్రోళ్ల భాగ్యలక్ష్మీసత్యనారాయణ, ఎంపీటీసీ నాగజ్యోతీలక్ష్మణ్ , ఉప సర్పంచ్ వడ్డే కుమార్ , ఎంపీడీవో బన్సిలాల్ , వెంకట్ రెడ్డి, దశరథరెడ్డి, లక్ష్మణ్ , సత్యనారాయణ పాల్గొన్నారు.

# రత్నమోదక్‌లతో గణేష్ పూజ




హైదరాబాద్ , సెప్టెంబర్ 18: పండుగ సీజన్‌లలో వేడుకలకు ఆరోగ్యకరమైన ములువును జోడిస్తూ, ప్రపంలోఏ అతిపెద్ద సైన్స్ ఆధారిత ఆయుర్వేద దిగ్గజం డాబర్ ఇండియా లిమిటెడ్ గణపతి రత్నమోదక్‌ను ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. గణపతి రత్నమోదక్‌లు మజ్‌బూత్ ఇమ్యూనిటి కా ఆశిర్వాద్ రత్నప్రాఫ్ ఇమ్యునిటి మోదక్ అనే ప్రత్యేక వినియోగదారుల అనుసంధాన కార్యక్రమం కింద పూణే మరియు హైదరబాద్‌లోని గణపతి పండాల్లో సందర్శకులకు అందుబులో ఉంచింది. డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కరోనా వ్యాప్తి తరువాత ఆరోగ్యం వినియోగదారుల మన్సులలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది. ఈ సంవత్సరం ఉత్సవాలు కూడా కోవిడ్ నియంత్రణలో జరుగుతున్నాయి. రత్నప్రశ్ రోగ నిరోధక కవచాన్ని అందించడానికి ఈ నగరాల్లోని గణపతి మండపాల సందర్శకులు, కళాకారులు మరియు పోలీసు సిబ్బదికి రత్నమోదక్‌లను పంపిణీ చేసామని, దుర్గా ప్రసాద్ తాము విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

# పోష్ మార్క్, ఇన్కా, సోషల్ షాపింగ్ ఇప్పుడు ఇండియాలో

హైదరాబాద్ , సెప్టెంబర్ 18: పోష్ మార్క్, ఇన్కా మిలియన్స్ కొలదీ ఇండియన్ వినియోగదారులు నూతన ట్రెండ్స్ కనుగొని, తమ స్టయిల్ అమ్మకం ద్వారా డబ్బు సంపాదించుకొనుటకు ప్రముఖ సోషల్ మార్కెట్ ప్లేస్ ఇండియా అంతటా క్లోజెట్స్ కనెక్ట్ చేస్తున్నది స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెట్స్ మరియు హోమ్ కొరకు కొత్త మరియు ప్రి-లవ్డ్ స్టయిల్స్ కొరకు ఒక ప్రముఖ సోషల్ మార్కెట్ ప్లేస్, నేడు ఇండియాలో సింపుల్, సోషల్ మరియు సస్టయినబుల్ సోషల్ అనుభవాన్ని లాంచ్ చేసింది. నేటి నుంచి ప్రారంభించి, ఇండియన్ వినియోగదారులు, 80 మిలియన్స్ కు పైగా వినియోగదారుల బూమింగ్ కమ్యూనిటీలో చేరి, మిలియన్స్ కొలదీ షాపింగ్ చేయదగిన మరియు డబ్బు సంపాదించు క్లాజెట్స్ కలిగిన వైబ్రంట్ నెట్ వర్క్ లో డబ్బు సంపాదించవచ్చు, డబ్బు పొదుపుచేయవచ్చు, ఇతరులు మరియు ఫోస్టర్ ఎంటర్ప్రెనర్షిప్ తో కనెక్ట్ కావచ్చు. పోష్ మార్క్ సెల్లర్ కమ్యూనిటీ ద్వారా క్యూరేట్ చేయబడి పెర్సనలైజ్ చేసిన సెల్లర్ కమ్యూనిటీ ద్వారా కొనుగోలుదారులు అత్యధిక ఆకర్షణీయమైన, ఒకరొకరు ఇచ్చిపుచ్చుకునే షాపింగ్ అనుభవం పొందగలుగుతారు. ఇండియాలో మొదటి టెక్నాలజీ అడ్వాన్స్ మరియు నిజమైన సోషల్ మార్కెట్ ప్లేస్ గా పోష్ మార్క్, సీమ్ లెస్ లిస్టింగ్, మర్చండైజింగ్, ప్రమోషన్, ప్రైసింగ్, మరియు షిప్పింగ్ తో సహా ఎండ్-టు-ఎండ్ సెల్లర్ టూల్స్ మరియు సర్వీసెస్ యొక్క ఫుల్ స్యూట్ ను అనేబుల్ చేయుట ద్వారా, ఎవరైనా తమ క్లోజెట్స్ నుండి ఐటమ్స్ అమ్ముటను సిపుల్ మరియు సులభం చేస్తుంది. ఇది ఇంకా అనేక ఫన్ మరియు ఎంగేజింగ్ సోషల్ టూల్స్ అందిస్తుంది, అలాంటి వాటిలో చేరినవి పోష్ పార్టీస్, పోష్ స్టోరీస్ మరియు రిపోష్. రిపోష్ అనేది కేవలం ఒక క్లిక్ తో తమ ఐటమ్స్ తిరిగి అమ్ముట సులభం చేస్తుంది. ఇని మాత్రమే కాక, ఇండియన్ కమ్యూనిటీ మెంబర్లు పోష్ మార్క్ యొక్క కొనుగోలుదారుని రక్షణ, అథెంటికేషన్ సర్వీసెస్ మరియు పోష్ పోస్ట్, పోష్ మార్క్ యొక్క సింపుల్ మరియు సులభమైన షిప్పింగ్ సర్వీస్ వంటి లాభాలు పొందుతారు. “ఇండియాలో పోష్ మార్క్ ను ప్రారంభించటం నాకు చాలా థ్రిల్లింగ్ గా ఉంది, ఈ దేశం ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఈ-కామర్స్



మార్కెట్లలో ఒకటి మరియు ఇది మితవ్యయం కలిగిన వైబ్రంట్ కల్చర్ మరియు నిరాడంబరతకు కొనియాడ బడుతున్న దేశం, ” మనీష్ చంద్ర, ఫోష్ మార్క్ సంస్థాపకులు, సిఇఒ. అన్నారు ‘ మరింత సమాచారం కొరకు ఝఝ.జూశీంష్ట్రఝతీఏ. ఙఅ మరియు పోష్ మార్క్ ఇండియా యొక్క ×అర్ఝన్రత్రీఝఏ_కు విచ్చేయండి.

# అక్టోబరు 10న మా ఎన్నికలు.. జీవితపై రఘుబాబు పోటీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. ‘మా’ ఎన్నికల్లో ఈసారి ప్రకాశ్ రాజ్, మంచు విష్ణు వర్గాల మధ్య ప్రధానపోటీ నెలకొంది. ఇప్పటికే ప్రకాశ్ రాజ్ తన ప్యానెల్ ను ప్రకటించారు. ప్రకాశ్ రాజ్ ప్యానెల్లో ‘మా’ ప్రధాన కార్యదర్శిగా జీవిత పోటీపడుతుండడం తెలిసిందే. తాజాగామంచు విష్ణు ప్యానెల్లో ‘మా’ ప్రధాన కార్యదర్శిగా నటుడు రఘుబాబు పోటీ పడుతున్నారు. ప్రకాశ్ రాజ్ ప్యానెల్ నుంచి వైదొలగిన నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కూడా ప్రధాన కార్యదర్శి పదవి కోసం స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మా ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

‘మా’ ఎన్నికలు అక్టోబరు 10న జరగనునున్నాయి. మా ఎన్నికల్లో అధ్యక్షుడి కోసం ప్రకాశ్‌రాజ్, మంచు విష్ణు, సీవీఎల్ నర్సింహారావు పోటీపడుతున్నారు. అక్టోబర్ 10న ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ హైదంబాద్ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణమోహన్ తెలిపారు. ఎనిమిది మంది ఆఫీస్ బేరర్స్ 18 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌తో కూడిన కమిటీకి ఈ ఎన్నికలు జరగనున్నాయి.

సెప్టెంబరు 27-29 తేదీల మధ్య నామినేషన్లు స్వీకరించి 30న వాటిని పరిశీలిస్తామని కృష్ణమోహన్ వివరించారు. అక్టోబరు 2వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, ఆ తర్వాత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. ఒక అభ్యర్థి ఒకే పదవికి మాత్రమే పోటీ చేయాలని, గత కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయి ఉండి, 50 శాతం కన్నా తక్కువ ఈసీ మీటింగ్‌లకు హాజరు కాకపోయి ఉంటే పోటీ చేసేందుకు అర్హత ఉండదని తెలిపారు. 20 శాఖల అసోసియేషన్‌లలో ఆఫీస్ బేరర్స్‌గా ఉన్న వారు ఆ పదవులకు రాజీనామా చేయకపోతే ‘మా’ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారని తెలిపారు.

# ఆయన బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్: గుత్తా సుఖేందర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 18:తెలంగాణ విమోచన దినోత్సవంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై శాసనమండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు పగటి కలలు కంటున్నారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఘట్టంతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. బీజేపీ సెప్టెంబర్ 17ను ఒక ఆట వస్తువులా ఆడుకుంటున్నదని విమర్శించారు. బీజేపీ పార్టీ హిందుత్వాన్ని ప్రోత్సహించాలని ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఏంఐఎం పార్టీని బూచిగా చూపెట్టి హిందువులను మభ్య పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ లో సుస్థిర పాలన అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే తెలంగాణ దోపిడీకి గురవుతుందని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నోటికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఆయన బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడరని గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# తృణమూల్‌లో చేరేందుకు బీజేపీ నేతలు టచ్‌లో ఉన్నారు : టీఎంసీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: బీజేపీ నేత బాబుల్ సుప్రియో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో చేరిన క్రమంలో పెద్దసంఖ్యలో కాషాయ పార్టీ నేతలు తమ పార్టీలోకి వచ్చేందుకు టచ్‌లో ఉన్నారని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు. బీజేపీలో అసంతృప్తితో రగులుతున్న పలువురు నేతలు తమ పార్టీలో చేరేందుకు టీఎంసీ అధినాయత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు.

ఒకరు (బాబూలాల్ సుప్రియో) ఈరోజు పార్టీలో చేరారు..రేపు మరొకరు..ఇలా ఈ ప్రక్రియ కొనసాగుతుందని, మనం వేచిచూడాలని ఘోష్ అన్నారు. ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్ధీకరణలో మంత్రిపదవి కోల్పోయిన సుప్రియో టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

# అక్టోబర్ 2వ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు :మెదక్ కలెక్టర్ హరీశ్

మెదక్, సెప్టెంబర్ 18:: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లాలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ పేరున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరీశ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తన చాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో తరుణ్‌కుమార్, స్వచ్ఛభారత్ మిషన్ సమన్వయ అధికారి సంతోష్‌తో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛత, శ్రమదానం రౌండ్ ఒకటిలో అన్ని మండల, గ్రామ స్థాయిలో స్వచ్ఛత జాగృతి యాత్ర ఏర్పాటు చేస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సేకరణ వంటి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇక స్వచ్ఛత, శ్రమదానం రెండవ రౌండ్‌లో భాగంగా ఒక సారి ఉపయోగించి వడేసిన ప్లాస్టిక్ నిషేధంపై గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేస్తారని, స్వచ్ఛభారతి సేవా వేడుకలు నిర్వహిస్తామని అన్నారు. మండల, గ్రామ స్థాయిల్లో కార్యక్రమాలను నిర్వహించేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అధికారులకు తగు ఆదేశాలిచ్చామని కలెక్టర్ హరీశ్ తెలిపారు.

# దుబాయ్‌లో ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శనివారం దుబాయ్ లో చందుర్తి వాసులు ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఆది శ్రీనివాస్ కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఫ్రెష్ అప్ కార్ వాష్ అధినేత మోతే రాములు మాట్లాడుతూ, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు తమపై ఎల్లవేళలా ఉండాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈకార్యక్రమంలో మోతె రాములు, ,కటుకం రవి, మరియు పొగుల.లచ్చయ్య, పొగుల.సతీష్, వోతె.లచ్చయ్య, మోతె.నారాయణ,మోతె. భారత్,బాలవేని. బాలకిషన్,మామిండ్ల. సతీష్, చెపురి వంశీ,జంగిలి నరేష్, తదితరులు పాల్గొన్నారు .

# తిరుపతిలో జర్నలిస్టుపై సమంత ఆగ్రహం

తిరుపతి, సెప్టెంబర్ 18:: టాలీవుడ్ టాప్ హీరోయిన్ సమంత, హీరో నాగచైతన్య త్వరలో విడాకులు తీసుకోనున్నారే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అంతేగాక నాగచైతన్య నుంచి సమంత రూ.250 కోట్ల భరణం కూడా డిమాండ్ చేస్తున్నదన్న ప్రచారం జోరందుకున్నది. ఈ పుకార్లతో విసుగు చెందిన సమంత.. గత కొన్ని వారాలుగా మీడియాకు కనిపించకుండా హైదరాబాద్‌కు దూరంగా ఉంటున్నది. ఈ క్రమంలో మనశ్శాంతి కోసం ఆమె శనివారం తెల్లవారుజామున తిరుమలకు వెళ్లింది. వీఐపీ వేళల్లో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేసింది.

అనంతరం ఆలయ పరిసరాల్లో నడుచుకుంటూ వెళ్తుండగా స్థానిక జర్నలిస్టులు ఆమెను చుట్టుముట్టారు. వారిలో ఓ జర్నలిస్టు సామ్, చైతూల విడాకుల పుకార్ల గురించి ప్రశ్నించాడు. అంతే సమంతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ ప్రశ్న అడిగిన జర్నలిస్టుకు పరుషంగా సమాధానం ఇచ్చింది. ‘గుడికి వచ్చీ? బుద్ధుందా..?’ అంటూ ఆ జర్నలిస్టు వైపు తీవ్రంగా చూస్తూ వెళ్లిపోయింది. అంతేకాదు తలలో బ్రెయిన్ ఉందా..? అన్నట్లుగా సంజ్ఞ కూడా చేస్తూ వెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అయితే, ఈ వీడియో సామ్ అభిమానులను అంతగా ఊరడించలేకపోయింది. ఎందుకంటే, మీడియాలో షికార్లు చేస్తున్న విడాకుల పుకార్లపై ఇప్పటికీ సమంతగానీ, నాగచైతన్యగానీ స్పందించకపోవడం వారిలో ఆందోళనను కలిగిస్తోంది. అభిమానులే కాదు, ఇతరులు కూడా వారి విడాకులపై క్లారిటీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏదైనా విభేదాలుంటే పరిష్కరించుకుని ఆ ప్రేమపక్షులు కలిసే ఉండాలని అభిమానులు ఆశపడుతున్నారు. ఈ మేరకు ఆ స్టార్ కపుల్ త్వరలో ఒక బహిరంగ ప్రకటన చేస్తుందని ఎదురుచూస్తున్నారు.

# ఆడబిడ్డలకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఇల్లందకుంట, సెప్టెంబర్ 18:: ఆడబిడ్డలకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట మండలం టేగుర్తి గ్రామంలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టేగుర్తి గ్రామానికి చెందిన మోటపోతుల రేణుక, తోడేటి కొమురమ్మ, నర్ర సులోచన (భోగంపాడు గ్రామం)కు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# గణేశ్ మండపాల వద్ద ఏనుగు మనోహర్ రెడ్డి పూజలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి లో శివాజీ యూత్ ,శివాలయం యూత్ ,సుభాష్ యూత్ మరియు న్యూవింగ్స్ యూత్ వినాయక మండపాలను టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గణనాథులను శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్బంగా మండపాల నిర్వాహకులు మనోహర్ రెడ్డి నీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు శ్రీ విఘ్నేశ్వరుని కృపతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని శ్రీ విఘ్నేశ్వరుని వేడుకున్నారుఈ కార్యక్రమంలో వివిధ కులాల సంఘాల నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి: జస్టిస్ లక్ష్మణ్



నిజామాబాద్, సెప్టెంబర్ 18:నిజామాబాద్ జిల్లాలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ పర్యటించారు. జిల్లా కేంద్రంలోని న్యాయసేవాధికార సంస్థ ప్రాంగణంలో శనివారం జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, జితేశ్ వి పాటిల్ హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయ కూడా న్యాయమూర్తితో భేటీ అయ్యారు. జిల్లా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ ఆదేశాలు ఇచ్చారు. న్యాయ సేవా అధికార సంస్థ నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు.

# ఆత్మరక్షణ విద్యల్లో ఆత్మవిశ్వాసం

## -బాలికలు ఆత్మరక్షణ కోసం తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందాలి
## - మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు






రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): బాలికలు ఆత్మరక్షణ కొరకు తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందాలని వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అన్నారు .ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు బెల్టులు లతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం, చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని అన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతరాతీయ స్థాయిలో రాణించి వేములవాడకు గుర్తింపు తేవాలని అన్నారు తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు .కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు,సిరిగిరి చందు,

మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్ మాట్లాడుతూ కరాటే విద్య నేర్చుకోవడం ద్వారా శారీరకంగా మానసికంగా ఎంతో దృఢత్వం అల పడుతుందని ప్రస్తుతం ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ , బిజెపి నాయకులు అంజిబాబు, తల్లిదండ్రులుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ నేత జన్మదిన వేడుకలు..

## - గోవిందరాజుల స్వామి ఆలయంలో పూజలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి. వేములవాడ రాజన్న ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను చందుర్తి మండలం సనుగుల శ్రీ గోవిందరాజుల స్వామి వారి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ తన ఇలవేల్పు అయిన గోవిందరాజుల స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్పిటిసి నాగం కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అలాగేచందుర్తి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద చందుర్తి గ్రామ శాఖ ఆధ్వర్యంలో కూడా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ నాగం కుమార్ . కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామ స్వామి హాజరై కేక్ కట్ చేసారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగాపూర్ ఎంపిటిసి మ్యకల గణేష్ మర్రిగడ్డ. సర్పంచ్ నేతి కుంట జలపతి. నాయకులు గొట్టె ప్రభాకర్. పులి సత్యం. ఉలిసే అంజి. లింగంపల్లి అశోక్. అజయ్ . దెబ్బటీ వెంకటేశం. ప్రసాద్. ముకుంద రెడ్డి. ఏగోళం శ్రీను కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.